క్లుప్తంగా

కార్మికవాడల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం

బెల్లంపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మూడు గంటల పాటు కార్మిక వాడలకు బుధవారం బెల్లంపల్లిలో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కన్నాల బస్తీలో ఓ ఇంటిని ఆనుకుని ఉన్న రెండు తీగలు గాలి వీయడంతో ఒకదానితో ఒకటి రాపిడి జరిగాయి. దీంతో షార్ట్‌సర్క్యూట్ జరిగి కన్నాల బస్తీతో పాటు టేకులబస్తీ, 24డీప్ ఏరియా, పోస్టాఫీసు బస్తీ కార్మికవాడల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మూడు గంటల పాటు ఏకధాటిగా కరెంట్ లేకపోవడంతో కార్మిక, కార్మికేతర కుటుంబాలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఉక్కపోతతో సతమతమయ్యారు. శుభకార్యాలకు అంతరాయం ఏర్పడింది. సింగరేణి ఎలక్ట్రీసిటీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని, రాత్రి 8గంటలకు విద్యుత్ సరఫరాను పునఃరుద్ధరించడంతో కార్మిక కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నాయి.

అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి

వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామపంచాయతీలలో ఎక్కువ మంది కూలీలు 100రోజుల పని పూర్తి చేసుకునేలా చూడాలని ఎఫ్ఏలకు సూచించారు. గ్రామ పంచాయతీల్లో కూలీ గిట్టుబాటు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వంద శాతం ఇంటి పన్ను వసూలు, పోలింగ్‌స్టేషన్లలో సౌకర్యాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ బాపురావు, ఏపీఓ సత్యప్రసాద్, ఈసీ మధుకర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రేపు పెరిక కుల సంఘం సర్వసభ్య సమావేశం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లోని ఎస్ కన్వెన్షన్ హాల్లో ఈ నెల 22న జిల్లా పెరిక కుల సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బేర సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నూతన గ్రామ, మండల, జిల్లా కమిటీల ఎన్నిక జరుగుతుందని సభ్యులంతా సకాలంలో హాజరు కావాలన్నారు.

నూతన కమిటీ నియామకం

నస్పూర్: సింగరేణి కాలరీస్ శ్రీరాంపూర్ ఏరియా బీసీ, ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని నియమించినట్లు అసోసియేషన్ సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పేరం రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా జాయింట్ సెక్రటరీగా కొమ్ము వెంకటేశ్వర్లు, పిట్ ప్రెసిడెంట్‌గా నరేందర్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల కోడ్‌పై అవగాహన



మాట్లాడుతున్న సీఐ నరేందర్

లక్సెట్టిపేట: ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నరేందర్ అన్నారు. మండలంలోని సూరారం, ఇటిక్యాల, పోతపల్లి, మోదెల గ్రామాల రైతులతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 63వ జాతీయ రహదారి రైతుల పొలాల నుంచి వెళ్తున్నందునా, రైతులు ఎటువంటి ధర్నాలు చేయొద్దని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందునా, పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నందునా ఎటువంటి ఇబ్బందులు కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రకుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పల్లెల్లో జాజిరి సందడి



నెన్నెల: పల్లెల్లో చిన్నారుల జాజిరిపాట సందడి మొదలైంది. హోలీ పండుగకు ముందు కాముడి పున్నమిని పురస్కరించుకొని గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు పిల్లలు జాజిరి ఆడటం తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. సాయంత్రం వేళల్లో పిల్లలంతా కోలలను లయబద్ధంగా కొట్టుకుంటూ పాటలు పాడుతూ ఇంటింటికీ తిరుగుతూ వారు ఇచ్చే ధాన్యం, డబ్బులు తీసుకుంటారు. 9రోజుల అనంతరం అమావాస్య నాడు కోలలను ప్రధాన కూడళ్లల్లో ఏర్పాటు చేసే కామదహణంలో వేసి దహనం చేస్తారు.

గుట్టుగా మొరం దందా..!

- రెబ్బనపల్లి గుట్టల్లో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



మొరం తవ్వకాలు జరిపిన ప్రదేశం

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి సమీపంలో గల గుట్టల్లో అక్రమ మొరం తవ్వకాలు గుట్టుగా సాగుతోంది. అనుమతుల పేరుతో కొందరు, అనుమతులు లేకుండా మరికొందరు, గుట్టను తవ్వుతూ, మొరం, మట్టిని తరలించాల్సిన చోటికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

తరిగిపోతున్న గుట్టలు..

ప్రకృతి వనరులైన గుట్టలు అక్రమార్కుల చేతుల్లో తరిగి పోతున్నాయనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. గుట్టల్లో ప్రభుత్వ భూమి ఉండటంతో, గతంలో కొంతమంది పేదలకు భూమిని కేటాయించారు. పేదలకు కేటాయించిన భూమిని చదును చేసుకునే క్రమంలో కొందరు మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు పొంది తవ్వకాలు జరిపినప్పటికీ, కొంతమంది మొరం మాఫియాలు ఇదే అదునుగా బావించి ఎలాంటి అనుమతులు లేకుండానే అప్పుడప్పుడు గుట్టుగా గుట్టలను తవ్వడంతో, అవి తరగిపోతున్నాయి.

చిక్కినట్టే చిక్కి..

ఇటీవల రెబ్బనపల్లి గుట్టల్లో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడికి వెళ్లే క్రమంలో దారిలో ఓ మొరం ట్రాక్టర్ ఎదురయ్యింది. ట్రాక్టర్‌ను పక్కకు నిలిపి, తవ్వకాలు జరిపే ప్రదేశానికి వెళ్లారు. అధికారులు అక్కడకు చేరుకునేలోపే తవ్వకాలు నిలిపి వేసి, వాహనాలతో సహా పారిపోయారు. ఇంతలో దారిలో పక్కకు నిలిపిన మొరం ట్రాక్టర్ కూడా అధికారుల కన్నుగప్పి తప్పించుకోవడం గమనార్హం. అధికారులు ఇప్పటికైనా నిఘా పెట్టి ప్రకృతి వనరులైన గుట్టలు తరగిపోకుండా కాపాడాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తప్పవు..

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం, మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవు. ఇటీవల రెబ్బనపల్లి గుట్టల్లో తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లే సరికి తవ్వకాలు నిలిపి తప్పించుకు పోయారు.

\- సంధ్యారాణి, తహసీల్దార్, దండేపల్లి

డ్రైవర్స్, క్లీనర్స్ వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న నాయకులు

మందమర్రిరూరల్: ఏరియాలో పనిచేస్తున్న లారీ డ్రైవర్స్, క్లీనర్స్ వేతనాలు వెంటనే పెంచి సమస్యలు పరిష్కరించాలని లారీ డ్రైవర్స్ అసోసియేషన్ బెల్లంపల్లి రీజియన్ (ఏఐటీయూసీ)అధ్యక్షుడు బోగె ఉపేందర్, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి పౌల్ డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియాలోని కేకే-ఓసీ వద్ద బుధవారం డ్రైవర్స్, క్లీనర్స్ విధులను బహిష్కరించి సమ్మెలోకి దిగారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. డ్రైవర్‌కు కనీస వేతనం రూ.32వేలు, క్లీనర్‌కు రూ.18వేలు చెల్లించాలని ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా వినలేదు. కొంత మంది లారీ ఓనర్స్ లారీలు నడపడంతో బొగ్గు రవాణా సాగుతోంది.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడుదాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్

జన్నారం: భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి అవకాశాల కోసం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీ.శ్రీకాంత్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో భగత్‌సింగ్ 93వర్ధంతి పోస్టర్లను బుధవారం స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ విముక్తి కోసం, స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ తన విలువైన ప్రాణాలను జాతికి అంకితం ఇచ్చారని, ఉరితాడును ముద్దాడి అమరుడయ్యారని పేర్కొన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో నేటి యువకులు సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నరేశ్, రాజు, స్వామి, శ్రీను తదితరులు ఉన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



తాండూర్: పరిశీలిస్తున్న అధికారులు



వేమనపల్లి: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తాండూర్: మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బుధవారం అధికారులు పరిశీలించారు. మండల పరిధిలోని బెజ్జాల, నరసాపూర్, ఎంవీకే త్రీ ఇంక్‌లెన్ పోలింగ్ కేంద్రాలను సీఐ కుమారస్వామి, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్ తనిఖీ చేసి స్థానిక పరిస్థితులపై ఆరా తీశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా అన్ని చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు. అధికారుల వెంట బీఎల్‌వోలు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఉండాలి

వేమనపల్లి: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండాలని ఎంపీడీఓ దేవేందర్ రెడ్డి అన్నారు. ఎంపీఓ బాపురావుతో కలిసి బుధవారం నీల్వాయి, కేతన్‌పల్లి, ముల్కలపేటలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ర్యాంపు, టాయిలెట్లు, ఫర్నీచర్, నీటి సౌకర్యం తదితర వాటిపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ లక్ష్మినారాయణ, పోలీసు అధికారి ఆనంద్‌పాల్, పంచాయతీ కార్యదర్శులు అశోక్, జాఫర్, సురేష్ ఉన్నారు.

అర్హులకు 'ఉపాధి' కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధ

భీమారం: ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డులు పొందిన వారందరికీ 100రోజుల పాటు పనికల్పించాలని ఎంపీడీఓ రాధ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. పనికల్పించే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. పనిస్థలాల వద్ద ఉదయం తొమ్మిది గంటల లోపే వెళ్లి పర్యవేక్షించాలని ఆదేశించారు. కూలీలు చేసిన పనులను పరిశీలించి వెంటనే కొలతలు తీసుకోవాలన్నారు. హరితహారం నర్సరీలకు గ్రీన్‌షెడ్‌లను నిర్మించాలన్నారు. ఇందులో ఉపాధిహామీ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో యూనివర్సల్ బ్యాంకు



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ వినయ్‌కుమార్

మంచిర్యాలఅగ్రికల్చర్: పట్టణంలోని యూనివర్సల్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 45వ సర్వసభ్య సమావేశం బుధవారం బ్యాంకు చైర్మన్ వి.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. బ్యాంకుకు 2023–24ఆర్థిక సంవత్సరంలో రూ.37.62లక్షల లాభం వచ్చిందని తెలిపారు. మంచిర్యాల, సీసీసీలో ఏటీఎం సౌకర్యం కల్పించామని, సీసీసీ ఎక్స్‌టెన్షన్ కౌంటర్ బ్రాంచ్‌గా మారిందన్నారు. బ్యాంకు ప్రగతి కోసం సహాయ సహకారాలు అందిస్తున్న వాటాదారులకు, ఖాతాదారులకు, రిజర్వ్ బ్యాంకు, సహకార శాఖ, మున్సిపల్ అధికారులకు, బ్యాంకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బ్యాంకు ఇన్‌చార్జి సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ.. బ్యాంకు చిన్న, మధ్యతరగతి ప్రజలకు రుణ సదుపాయం కల్పిస్తూ, వారి ఆర్థిక ప్రగతికి తోడ్పడుతుందని తెలిపారు. బ్యాంకు నుంచి రూపే డెబిట్ కార్డులు, క్యూ ఆర్ స్కానర్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ జీ.పూర్ణ చంద్రరావు, డైరెక్టర్లు ఆర్.ప్రసాద్‌రావు, జీ.రాజలింగు, కే.రత్నం, కే.సుశీల, ఎస్.భాగ్యలక్ష్మి, వాటాదారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజశిఖరమూర్తి ప్రతిష్ఠా మహోత్సవం



హారతి పడుతున్న పీఠాధిపతి పురుషోత్తమ స్వామి

నెన్నెల: మండల కేంద్రంలోని గంగాధర దేవాలయం(శివాలయం), హన్మాన్ మందిరంలో బుధవారం ధ్వజశిఖరమూర్తి, ధ్వజస్తంభాల ప్రతిష్ఠ అంగరంగవైభవంగా జరిగింది. శ్రీశ్రీశ్రీ శృంఘేరి గంగా పీఠాధిపతి పురుషోత్తమ మహాస్వామి, గట్టు నరహరిశర్మ అవదానితో పాటు 20మంది వేదపండితుల ఆధ్వర్యంలో మంత్రోచ్చరణలతో మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి యాగం నిర్వహించారు. అనంతరం ఉమామహేశ్వరుల శాంతి కల్యాణోత్సవం మహామంత్ర పుష్పం, తీర్థప్రసాదాల వితరణ చేశారు. మూడు రోజుల పాటు జరిగిన నవగ్రహ శిఖర, యంత్రమూర్తి స్థిరప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి ఉద్యోగ, వ్యాపార రీత్యా సుదూర ప్రాంతాలలో స్థిరపడిన నెన్నెల గ్రామానికి చెందిన ఉన్నత స్థాయి అధికారులు, వ్యాపారవేత్తలు సుమారు వెయ్యి మంది వరకు హాజరుకావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భారీ సంఖ్యలో వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

బురద రోడ్డుతో ఇబ్బందులు



శివరాంపల్లిలో రహదారిపై నిలిచిన మురుగునీరు

కోటపల్లి: మండలంలోని జనగామ, శివరాంపల్లిలో రోడ్డుపై బురద నిలిచి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాల పాలవుతున్నామని వాపోయారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై నిలిచిన బురద తొలగించి నీరు నిల్వ లేకుండా చూడాలని కోరుతున్నారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే ఐసీడీఎస్ లక్ష్యం



తాండూర్: మహిళలు, బాలింతలతో అధికారులు



మంచిర్యాలటౌన్: గర్భిణులకు సీమంతం చేస్తూ...



భీమిని: మల్లీడిలో అవగాహన



బెల్లంపల్లిరూరల్: అవగాహన కల్పిస్తున్న జ్యోతి



దాంపూర్‌లో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

- కొనసాగుతున్న 'పోషణ పక్వాడా'
- పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

తాండూర్: మహిళల సంపూర్ణ ఆరోగ్యమే ఐసీడీఎస్ ప్రధాన లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. మండలంలోని నర్సపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పోషణ పక్వాడా కార్యక్రమానికి తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిన్నారులకు సామాహిక అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం తల్లులకు, పిల్లలకు చిరుధాన్యాల వాడకంపై వివరించారు. తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జమున, లక్ష్మి, కరుణ, విజయ, సీత, తిరుమలేశ్వరి, సువర్ణ, మహిళలు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని దొరగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రం 1లో బుధవారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం చేసి, చిన్నారులకు అన్నప్రాసన చేసి, గర్భిణులు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంపై వివరించి, మిల్లెట్స్‌తో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి వివరించారు. అనంతరం మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక, ఫైనాన్సిల్ లిటరసీ లిప్సికలు మహిళలు, బాలికల రక్షణ అంశాలను వారికి వివరించారు. బేటీపడావో-బేటీ పడావో పథకం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైమ్, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 100 వంటివి వివరించారు. టీచర్లు డి.సుజాత, ఈ మల్లేశ్వరి, ఆయా రమాదేవి పాల్గొన్నారు.

భీమిని: కన్నెపల్లి, భీమిని మండలాల్లోని మల్లీడి, సుర్జాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ పిల్లలు, తల్లులు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందజేశారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు మహేష్, సుదర్శన్, అంగన్‌వాడీ టీచర్లు మల్లమ్మ, కవిత, సరోజ, సరస్వతీ, ఏఎన్ఎం, ఆశలు పాల్గొన్నారు.

బలవర్ధకమైన ఆహారం అందించాలి

బెల్లంపల్లిరూరల్: చిన్నారులకు, గర్భిణులకు మంచి పోషక విలువలు కలిగిన బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. మండలంలోని గురిజాల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరుధాన్యాలలో ఐరన్, ఫైబర్, ప్రోటీన్స్, జింక్ ఎక్కువగా ఉండి ఎక్కువ శక్తిని ఇస్తాయని, అటువంటి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సూచించారు. పలు అంశాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కృపారేణుక, భాను, మంగావతి, అంజు, ఐకేపీ సీసీ ప్రసాద్, ఐకేపీ మహిళలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరలు అధికంగా వాడాలి

భీమారం: గర్భిణులు ఆకు కూరలను అధికంగా వినియోగించాలని ఐసీడీఎస్ రజిత కోరారు. మండలంలోని దాంపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గర్భిణీ మహిళలకు పోషణ విషయంలో ఐసీడీఎస్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. రక్తహీనతతో ఉన్న మహిళలను కూడా గుర్తించి వారికి ప్రత్యేక ఆహారం అందిస్తున్నామని తెలిపారు. ప్రతీ తల్లి తన పిల్లలను విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. ఇందులో టీచర్లు లక్ష్మి, రవళిలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత



కట్టడాన్ని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాకతీయ కాలనీలో మున్సిపల్ రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని మున్సిపల్ అధికారులు తొలగించారు. అనుమతులు లేకుండా రహదారులపైన, మున్సిపల్ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాల్లో ఎవరైన అక్రమంగా నిర్మాణాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధికార ప్రతినిధిగా తిరుపతి

లక్సెట్టిపేట: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా బియ్యాల తిరుపతి నియామకమైనట్లు బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు, జిల్లా అధ్యక్షురాలు సురేఖ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి



విద్యార్థినికి బహుమతి ఇస్తున్న ఏసీపీ రవికుమార్



నృత్యం చేస్తున్న బాలికలు

బెల్లంపల్లి: ఇష్టపడి చదివి విద్యార్థులు జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన గెట్ టు గెదర్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ గొప్ప వరమన్నారు. జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పట్టుదలతో చదవడం అలవాటు చేసుకోవాలని, చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. ప్రయోజకులు కావడానికి చదువును మించింది మరొకటి లేదన్నారు. యువకులు దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సెలఫోన్, ఇతరాత్ర వ్యాపకాలపై దృష్టి మరల్చకుండా కేవలం చదువుపైనే చూపుసారించి గొప్పగా చదవాలన్నారు. పోటీ తత్వాన్ని అలవర్చుకుని చదవడం వల్ల ఉపయోగం ఉంటుందన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎంతో నాణ్యతతో కూడిన విద్యాబోధన చేస్తున్నామన్నారు. అవసరమైన వినోదం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు దోహదపడే అనేకాంశాల్లో తగిన సూచనలు, సలహాలను ఇస్తున్నామని వివరించారు. కాగా గెట్‌టు గెదర్‌ను పురస్కరించుకుని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు. జానపద, సినిమా పాటలపై బాలబాలికలు నృత్యాలు చేసి అదరహో అనిపించారు. వివిధ అంశాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఏసీపీ, ప్రిన్సిపాల్ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా లక్ష్మి



నియామకలేఖ అందుకుంటున్న లక్ష్మి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహిళా కాంగ్రెస్ హాజీపూర్ మండల అధ్యక్షురాలిగా ముల్కల్ల గ్రామానికి చెందిన బైరం లక్ష్మి నియామకం అయ్యారు. ఈ మేరకు బుధవారం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ చేతుల మీదుగా నియామక లేఖను అందజేశారు. తనపై నమ్మకంతో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించినందుకు గాను మండలంలో మహిళా లోకాన్ని చైతన్యం చేసి కాంగ్రెస్ పార్టీకి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని లక్ష్మి తెలిపారు.